క్లుప్తంగా

నేడు మండల పరిషత్ పాలకవర్గ సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం నేటి ఉదయం 11 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కదలి పద్మజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొంటారని మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా సమావేశంలో పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం



కిశోరి వికాసం రీసోర్స్ పర్సన్ల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న పీవో గజలక్ష్మి

రాయవరం: బాల్య వివాహాలపై గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఐసీడీఎస్ పీవో అధికారి గజలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామస్థాయి రీసోర్స్ పర్సన్స్‌కు కిశోరి వికాసంపై శిక్షణనిచ్చారు. శిక్షణ కార్యక్రమంలో పీవో గజలక్ష్మి, ఎంపీడీవో కీర్తిస్పందన మాట్లాడుతూ కిశోరి బాలికలకు వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్ల లోపు వయసు వారికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే కిశోరి బాలికలకు బలవర్ధక ఆహారం అందేలా చూడాలన్నారు. కిశోరి వికాసంపై ఒక రోజు శిక్షణను గ్రామస్థాయి రీసోర్స్ పర్సన్స్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రామలక్ష్మణమూర్తి, తూర్పుగోదావరి జిల్లా వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ ఛైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.

పీడీ సత్యనారాయణకు వీడ్కోలు



పీడీ సత్యనారాయణ దంపతులకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

మండపేట: స్థానిక ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వీవీ సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. సత్యనారాయణ దంపతులకు కాలేజీ విద్యార్థులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికి వేదికపైకి తీసుకు వచ్చారు. ప్రిన్సిపాల్ అప్పలరాజు ఆధ్వర్యంలో సత్యనారాయణ, విజయకుమారి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 38 ఏళ్లపాటు వ్యాయామోపాధ్యాయునిగా సేవలు అందించిన సత్యనారాయణ వందలాది మందిని ఉన్నత స్థానాలకు చేర్చారన్నారు. కార్యక్రమంలో రావులపాలెం, ఆలమూరు జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ప్రైవేటు విద్యా సంస్థల అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల డీలర్లకు రాత పరీక్ష

రామచంద్రపురం: రామచంద్రపురం డివిజన్ పరిధిలో డీలర్ రాజీనామా, మరణం వలన ఏర్పడిన ఖాళీలు, అదే విధంగా కొత్తగా ఏర్పడినవి కలసి మొత్తం 91 ఖాళీల్లో రేషన్ డీలర్లను నియమించడానికి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆర్డీఓ దేవరకొండ అఖిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత పరీక్ష ఈ నెల 19న, ఇంటర్వ్యూలు 22, 23 తేదీల్లో నిర్వహించి ఎంపిక చేయనున్నామన్నారు. 24న ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

ఛిద్రమైన పశువుల ఆసుపత్రి మెట్లు



దెబ్బతిన్న ఆసుపత్రి మెట్లు, ఊడిపడిన టైల్స్

కపిలేశ్వరపురం: అంగర పశువుల ఆసుపత్రి మెట్లు ఛిద్రమయ్యాయి. ఆసుపత్రి సిమెంట్ మెట్లు పగిలాయి. అప్రోచ్ టైల్స్ ఊడిపడ్డాయి. ఆసుపత్రిలోకి వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధించిన అధికారులు మెట్లను మెరుగుపర్చాలని కోరుతున్నారు.

నత్తనడకన వరినాట్లు

- ఆలస్యమవుతున్న రబీ
- రైతులు చొరవ చూపాలని
- చివరిలో చిక్కులు తప్పవంటున్న అధికారులు



గొల్లపాలెంలో పంట దమ్ము చేస్తున్న ట్రాక్టర్



కాజులూరులో వరినాట్లు వేస్తున్న మహిళలు

కాజులూరు: జనవరి నెల ప్రారంభమైనప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో నేటికి వరి నాట్లు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ రైతులు పంటదమ్ములు చేస్తూ వెదజల్లికలు నిర్వహిస్తున్నారు. మండల గ్రామాల్లో వరి పొలాలు తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. దీంతో సాధారణంగానే డెల్టా ఎగువ ప్రాంతంలోని కడియం, మండపేట తదితర ప్రాంతాల కంటే మండల గ్రామాల్లో ఒకటి, రెండు వారాలు ఆలస్యంగా ఇక్కడ వరిసాగు ప్రక్రియ కొనసాగుతుంది. ఈ లెక్కన చూసినా నవంబరు నెలాఖరు నాటికి రైతులు తొలకరి మాసూళ్లు ముగించి డిసెంబరు రెండో వారం నాటికి దాళ్వా వరినాట్లు పూర్తి చేయాల్సి వుంది. అయితే ఈ ఏడాది తొలకరి చివరి దశలో ఏర్పడ్డ ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు మండల గ్రామాల్లో వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో తొలకరి మాసూళ్లలో తీవ్ర జాప్యం జరిగి దాని ప్రభావం దాళ్వా సాగుపై పడింది. అయితే ప్రస్తుతం దాళ్వా వరినాట్లు, వెదజల్లికలు ఆలస్యమైతే పంట చివరి దశలో సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులరే గురికావలసి వస్తుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. గతంలో మాదిరి మార్చి, ఏప్రియల్ నాటికి గోదావరినదిలో నీటి నిల్వలు తగ్గి కాలువలకు నీటి ఎద్దడి ఏర్పడితే శివారు భూములకు నీటి సరఫరా తగ్గిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోపక్క ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి కాలువ నీరు నిలుపుదల చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తుగానే హెచ్చరిస్తున్నారు. ఫలితంగా రైతులు సాగు ప్రారంభించేందుకు కాలయాపన చేస్తుంటే చివరిలో నీరులేక పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు వివరిస్తున్నారు. రైతులు చొరవచూపి త్వరితగతిన సాగుకు ఉపక్రమించాలని, ఇప్పటికే కాలాతీతమైనందున తక్కువ కాలపరిమితికి దిగుబడినిచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వర్షాల వల్లే సాగు ఆలస్యం



ఈ ఏడాది తొలకరిలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసి మాసూళ్లు ఆలస్యమయింది. ఏదో విధంగా చొరవ చేసి దాళ్వా నారుమడులు చల్లుకున్నాం. గింజ మొలకెత్తే సమయంలో పూడుకుపోయిన డ్రెయిన్ల కారణంగా పొలాల్లో నీరు దిగక మొక్క కుళ్లిపోయింది. రెండోసారి నారుమడులు చల్లుకోవడంతో ఆలస్యమయింది. – కేశన వీర్రాజు, రైతు అంద్రంగి

ఆలస్యమైతే ఇబ్బందులే..



వరి పంట గింజ గట్టిపడి పక్వానికి వచ్చే వరకూ సాగు నీరు అవసరం. చివరి దశలోనూ సాగునీరు అందకుంటే దిగుబడి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికీ నాట్లు వేయని రైతులు వెదజల్లిక విధానాన్ని అవలంబించాలి. తక్కువ రోజుల్లో పక్వానికి వచ్చే వంగడాలను ఎంచుకోవాలి. – వి.అశోక్, కాజులూరు ఏవో

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



మండల స్థాయి పోటీల్లో సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయిని జయప్రియ

రామచంద్రపురం: పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో వివేకానంద పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వ్యక్తిగత విద్యార్థి విభాగంలో 9వ తరగతి విద్యార్థి పి.సత్య సంజయ్ భరత్ మండల స్థాయిలో మొదటి స్థానం గెలుచుకుని జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాడు. అదే విధంగా ఉపాధ్యాయుల విభాగంలో ఎం.జయప్రియ మొదటి స్థానాన్ని కైవశం చేసుకున్నారు. వీరు ఈ నెల 4న పి.గన్నవరంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని, భరత్ గైడ్ టీచర్ రాజీవ్‌లను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

10 లోగా దరఖాస్తులు అందించాలి

మామిడికుదురు: మండలంలోని ప్రతిభావంతులైన, ఆర్థికంగా వెనుకబడిన కాపు విద్యార్థులకు తులసీ సీడ్స్ అధినేత గుంటూరుకు చెందిన తులసీ రామచంద్రప్రభు ఆర్థిక సాయంతో ఈ నెల 19న నగదు పురస్కారాలు అందజేస్తామని తెలగా ఉద్యోగ సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తెలిపారు. మామిడికుదురులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజోలు మండలం శివకోడు మంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో ఈ పురస్కారాల పంపిణీ జరుగుతుందన్నారు. రాజోలు తాలూకా తెలగా ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు 80 శాతం పైబడి మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోగా మండల కార్యవర్గ సభ్యులకు తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో మీకు పావలా వాటా లేదా!

- వేగుళ్లది అడ్డదిడ్డ మాటలే..
- ఎమ్మెల్యేపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మండపేట నియోజకవర్గంలో అన్ని మద్యం షాపుల్లో మీకు 25 పైసల వాటాలేదా అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని తోట మండిపడ్డారు. స్థానిక విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వేగుళ్లకు మద్యం వ్యాపారం, ఇసుకలో వాటాలున్నాయని తాను ప్రశ్నిస్తే దానికి సమాధానం ఇవ్వకుండా అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని అన్నారు. గతం నుంచీ అన్ని గ్రామాల్లో బెల్టు షాపులు టీడీపీ ఆధ్వర్యంలోనే ఆ పార్టీ కార్యకర్తలు నిర్వహిస్తున్నారన్నారు. నోటిఫైడ్ చేసిన మద్యం షాపుల్లో సీసాపై ఉన్న రేట్లకే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, బెల్టు షాపుల్లో అధికంగా విక్రయిస్తున్నారని.. ఇదంతా మీ కనుసన్నల్లోనే జరుగుతుందన్నారు. తాను గత పత్రికా సమావేశంలో విద్యుత్ చార్జీలు, ఇసుక, మద్యం షాపులపై అడుగ్గా మీరు నాకే ఇసుక, మద్యం వ్యాపారం ఉందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సబబు కాదన్నారు. పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనే ఉద్దేశంతో జనం ఓట్లు వేశారే తప్ప మిమ్మల్ని మాత్రం చూసి కాదని తోట అన్నారు.

ద్రాక్షారామలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడిపల్లి గ్రామానికి చెందిన పండు రమేష్ తాళ్లపాలంలోని పిల్లి మణికంఠ చెందిన పంట పొలం కౌలుకు చేస్తున్నానని, గురువారం ఉదయం 10 గంటలకు తాడిపల్లికి చెందిన సాదే వెంకన్నతో కలసి అందులో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి పనులు చేసుకుంటూ ఉండగా కట్టా గోవిందు, కట్టా రాజా అనే ఇద్దరు వచ్చి తమను ఆ స్థలాన్ని వదిలి వెళ్లిపోవాలని బెదిరించారని, తనను కులం పేరుతో నిందించారని అదే సమయంలో మేడిశెట్టి ఇజ్రాయేలు వచ్చి తనను చంపాలని సూచించాడని దాంతో తనపై ఇటుకతో దాడి చేశారని, వెంకన్నకు చెందిన బైక్‌పై పెట్రోలు పోసి నిప్పు అంటించారని పండు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

రాజకీయ కక్షతో తప్పుడు కేసులు..

కుటుంబ తగాదాల్లో ఉన్న తమ ఆస్తిపై కన్నేసిన టీడీపీ నాయకుడు, రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రధాన అనుచరుడు అయిన దొంగల శ్రీధర్ తప్పుడు విధానంలో తన పేరున, తన భార్య అయిన దొంగల సునీత పేరున కొంత భూమిని రాయించుకుని తమ కుటుంబ వివాదంలోకి వచ్చి తమను బెదిరిస్తున్నారని తాళ్లపాలం గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ క్రమంలోనే తనపైన, తన కుటుంబ సభ్యులపైన ఇప్పటికే రెండు తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. గురువారం ఉదయం తన మేనమామ గుత్తుల సత్యనారాయణ పందలపాకలో మృతి చెందిన కారణంగా ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నామని, అదే సమయంలో తాళ్లపాలంలోని తమ పొలం దగ్గర స్కూటర్ దహనం సంఘటనను సృష్టించి తమపై లేనిపోని కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ అక్రమ కేసుల గురించి తగిన విచారణ చేసి తమను కాపాడాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి గీటురాయి



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ భవాని తదితరులు

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి గీటురాయి వంటిదని, పదో తరగతి పరీక్షలలో నూరు శాతం మార్కులు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని తనుమళ్ళ గ్రామ సర్పంచ్ పోతుల భవాని అన్నారు. పెనుమళ్ళ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్‌లోని నిపుణులైన ఉపాధ్యాయ బృందం ముద్రించిన ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం సర్పంచ్ పోతుల భవాని, భీమరాజు దంపతులు స్వచ్ఛందంగా పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గతంలో పలుమార్లు పెనుమళ్ళ పాఠశాల పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెనుమళ్ళ మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు వి.భానుప్రకాశ్, సభ్యులు వి.గౌతమి, రవికుమార్ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన పెంపొందించాలి



కాజులూరులో జ్యోతిని వెలిగించి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న జ్యోతి తదితరులు

కాజులూరు: కిశోరి వికాసంపై బాలికల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ప్రవీణ అన్నారు. శుక్రవారం కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి అధ్వర్యంలో కిశోరి వికాసంపై సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు, మహిళలకు బాలికా హక్కులు, బాలికల శరీర శుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ జె.రాంబాబు మాట్లాడుతూ ఇటీవల బాలలపై వివక్షత తీవ్రరూపం దాల్చిందని బాల్య వివాహాలు, బాలలపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. బాలలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, ఎంఈఓ డేవిడ్ ఏపీఎం కె.సురేష్, ఐసీడీఎస్ సిబ్బంది కనకరత్నం, మాణిక్యాంబ, పలువురు ఏఎన్ఎంలు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రాణాపాయం

ఆలమూరు: 216 (ఏ) నంబర్ జాతీయ రహదారిలోని జొన్నాడ వద్ద కారు బోల్తా పడిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఒక చిన్న కారు స్థానిక ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సరికి అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు వల్ల ఇసుక ట్రాక్టర్‌ను తప్పించబోయి బోల్తా కొట్టింది. స్థానికులు స్పందించి కారులో చిక్కుకున్న రాజోలు గ్రామానికి చెందిన ఎం.దేవరాజ్ కుటుంబ సభ్యులను సురక్షితంగా బయటకు తీశారు. వారంతా స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒక మహిళ, ఒక పురుషుడితో పాటు నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

ఆలమూరు మండల అధికారులు

హోదా	ఫోన్ నంబరు
తహసీల్దార్	98499 03902
రావులపాలెం రూరల్ సీఐ	94407 96537
సబ్ ఇన్‌స్పెక్టర్	94409 04849
ఇన్‌చార్జి ఎంపీడీఓ	83175 42815
వెటర్నరీ ఏడీ	95503 93727
ఈఓపీఆర్‌డీ	83175 42815
ఏడీఏ	83310 56664
మండల వ్యవసాయాధికారి	83310 56557
ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	97012 87828
ఎన్ఆర్‌జీఈఎస్ ఏపీఓ	70933 23644
వెలుగు ఏపీఎం	98499 01696
హౌసింగ్ జేఈ	70939 30448
ఎంఈఓ-1	80748 05733
ఎంఈఓ-2	96189 37973
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	91001 21135
సీడీపీఓ, కొత్తపేట	94408 14683
చొప్పెల్ల పీహెచ్‌సీ	70136 40523
పెదపళ్ల పీహెచ్‌సీ	88017 87816
ఇరిగేషన్ జేఈ	83286 29109
పశువైద్యాధికారి	95332 87404
ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	91609 88844
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	63099 39852
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	89778 30575
ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి	93467 87187
మండల ఇంజినీరింగ్ జేఈ	83175 43987
ఆర్అండ్‌బీ జేఈ (మండపేట)	94408 18537
ఉద్యాన శాఖాధికారి	87126 25210
కార్మిక శాఖాధికారి	94925 55059
అటవీ శాఖాధికారి	98493 52664
ఆర్టీసీ డిపో (ఆర్‌సీపురం)	73828 25536
ఆర్టీసీ డిపో (రావులపాలెం)	99592 25537
ట్రాన్స్‌కో ఏఈ (ఏపీఈపీడీఎల్)	94408 12601
డ్రైన్స్ ఏఈ	88860 66939

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



ద్రాక్షారామలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలో నాయకులు



సావిత్రీబాయికి నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

రామచంద్రపురం రూరల్: మహిళా సామాజిక వేత్త, దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జయంతిని మండలంలోని వేగాయమ్మపేట, ద్రాక్షారామల్లో ఘనంగా నిర్వహించారు. వేగాయమ్మపేటలోని శ్రీమతి మహాలక్ష్మమ్మ హిందూ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు టి.విజయనిర్మల, కె.కనకదుర్గ, ఎల్.శ్రీలక్ష్మి, జి.అనురాధ, ఎండీ పర్వీన్ సుల్తానాలను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.వీ మోహన్, వీవీడీఎల్ నారాయణరావు, జె.లోవరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో నియోజకవర్గ మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే సేవలను వక్తలు కొనియాడారు. ఆమె జయంతిని టీచర్స్ డేగా నిర్వహించాలని, భారతరత్న ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో..

మండపేట: స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని బీసీ సంఘం నాయకులు మల్లువలస గణపతి, పెంకే గంగాధర్, వినకోట రాధాకృష్ణ, వీరమల్లు శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే 194వ జయంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకాలువ వంతెన వద్ద గల జ్యోతీరావు పూలే విగ్రహం పక్కనే ఆమె ఫ్లెక్సీ ఏర్పాటు చేసి పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పిల్లి గణేశ్వరరావు, పిఠాపురం సత్యనారాయణ, సూరంపూడి సత్యప్రసాద్, మట్టపర్తి గోవిందరాజు, పంపన శ్రీనివాస్, కోటిపల్లి కృష్ణ, అల్లక శ్రీనివాస్, చుక్కల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: సావిత్రీబాయి పూలే ఆశయాలను నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని మండల బీసీ సంఘం నాయకుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం బీసీ సంఘం నాయకులు సావిత్రీబాయిపూలే జయంతిని నిర్వహించారు. కాజులూరులో జరిగిన కార్యక్రమంలో పెంకే సత్యనారాయణ, గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు, డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు, దుగ్గుదుర్రులో బీసీ నేత కదలి రాంపండు, కుయ్యేరులో సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి సావిత్రీబాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు బయటకు రావాలంటే ఎన్నో ఆంక్షలు ఉండే ఆ రోజుల్లో సావిత్రిబాయిపూలే మహిళా పాఠశాలను స్థాపించి ఎందరో బాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారన్నారు.